హుమ్నపూర్‌లో పట్టుకున్న రేషన్ బియ్యంతో అధికారులు

రేషన్ బియ్యం పట్టివేత

జహీరాబాద్, డిసెంబర్ 17: అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. సోమవారం రాత్రి నమ్మదగ్గ సమాచారం మేరకు న్యాల్‌కల్ మండలంలోని హుమ్నపూర్‌లోని మహ్మద్ ఉస్మాన్ ఇంటిపై దాడి చేశారు. లబ్ధిదారుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన 13 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కోహీర్ మండలంలోని దిగ్వాల్ సివిల్ సప్లై గోదాంకు తరలించారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్యామ్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెప్పకుండా విద్యుత్ మరమ్మతులు చేయొద్దు

మునిపల్లి, డిసెంబర్ 17: విద్యుత్ అధికారులకు సమాచారం లేకుండా గ్రామాల్లో స్తంభాలు ఎక్కి మరమ్మతులు చే యొద్దని మునిపల్లి మండల విద్యుత్ ఏఈ సంతోష్ మంగళవారం ప్రకటనలో కోరా రు. గ్రామాల్లో విద్యుత్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా మరమ్మతులు చేస్తున్నారని, అనుమతి లేకుండా స్తంభాలు ఎక్కితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పల్లెల్లో ఎలాంటి విద్యుత్ సమస్యలు ఉన్నా లైన్‌మెన్‌కు సమాచారం అందించి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

జహీరాబాద్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

అందోల్: జోగిపేటలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లగచర్ల రైతులను విడిచిపెట్టాలి

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన బీఆర్ఎస్ నాయకులు

జహీరాబాద్, డిసెంబర్ 17: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి, వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించినందుకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు పిలుపుమేరకు జహీరాబాద్ పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జహీరాబాద్ మండల అధ్యక్షుడు తట్టు నారాయణ మాట్లాడుతూ ఫార్మా కంపెనీల కోసం లగచర్ల రైతులు భూములు ఇవ్వనందుకు అక్రమంగా కేసులు నమోదు చేసి జైళ్లకు తరలించారన్నారు. వారికి బెయిల్ రాకుండా కోర్టులో అడ్డుకుంటున్నారని, ఛాతీలో నొప్పి వచ్చినా రైతులకు బేడీలు వేసి దవాఖానకు తీసుకెళ్లడం దారుణమని మండిపడ్డారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మొగుడంపల్లి, ఝరాసంగం మండలాల అధ్యక్షులు సంజీవ్‌రెడ్డి, వెంకటేశం, నాయకులు యాకు బ్, బండి మోహన్, నర్సింహులు గౌడ్, ప్రభుపటేల్, చిన్నారెడ్డి, ప్రవీణ్‌కుమార్, పర్వేజ్, అమీత్‌కుమార్, హీరురాథోడ్, గోపాల్, సంజూపవర్, రాథోడ్ భీంరావు, గులాబ్ సింగ్, చందుజాదవ్, చందర్ పాల్గొన్నారు.

సంగారెడ్డి కలెక్టరేట్: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కేసులు ఎత్తివేయాలి

అందోల్, డిసెంబర్ 17: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని జోగిపేట ఏఎంసీ మాజీ చైర్మన్ నాగభూషణం, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు చాపల వెంకటేశం డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి లగచర్ల రైతులకు విముక్తి కల్పించాలని కోరుతూ అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని ఆరోపించారు. మొగులయ్య, ఖాజాపాషా, దుర్గేశ్, పోచయ్య, ప్రశాంత్‌కుమార్, రఫీక్ పాల్గొన్నారు.

హత్నూర: దౌల్తాబాద్‌లో..

రైతన్నకు సంకెళ్లు వేసిన ఘనత కాంగ్రెస్‌దే..

మునిపల్లి, డిసెంబర్ 17: రైతన్నలకు సంకెళ్లు వేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని మునిపల్లి మజీ జడ్పీటీసీ మీనాక్షీసాయికుమార్ ఆరోపించారు. బీఆర్ఎస్ హయాంలో అన్నదాతలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. జైలులో ఉన్న లగచర్ల రైతులను ఎలాంటి షరతులు లేకుండా విడిచిపెట్టాలని డిమాండ్ చేశారు.

ఇంకెంతకాలం కొనసాగుతావ్ ఎగ్గె మల్లేశం?

మాట్లాడుతున్న మాజీ కార్పొరేటర్ అంజయ్య, కరికె సత్యనారాయణ

రామచంద్రాపురం, డిసెంబర్ 17: కురుమ సంఘాన్ని వాడుకొని రాజకీయంగా, ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారే కానీ, సంఘం బలోపేతానికి, కురుమలకు ఎలాంటి లబ్ధి చేకూర్చడం లేదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ ఎగ్గె మల్లేశం, జిల్లా అధ్యక్షుడు బూరుగడ్డ నగేశ్ తీరుపై కురుమ సంఘం ఆర్సీపురం మండల మాజీ అధ్యక్షుడు కరికె సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ అంజయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆర్సీపురంలోని కురుమ సంఘం భవనం వద్ద మాట్లాడారు. 1982లో ఆర్సీపురంలోని శ్రీనివాస్‌నగర్‌లో కురుమ సంఘం భవనం నిర్మించామని, ప్రస్తుతం శిథిలావస్థకు చేరిందన్నారు. కురుమ సంఘం జిల్లా అధ్యక్షుడు అని చెప్పుకుంటున్న బూరుగడ్డ నగేశ్ కురుమల సహకారంతో రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగి కురుమలను విస్మరిస్తున్నారని మండిపడ్డారు. రాజకీయ ప్రయోజనాల కోసం ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీలోకి వెళ్తారని, కురుమల మద్దతు లేకుండానే తమరి సతీమణి కార్పొరేటర్ అయ్యేనా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం కురుమ సంఘానికి కోకాపేటలో ఐదెకరాల భూమి, రూ.5 కోట్లు నిధు లు ఇచ్చి నిర్మిస్తే సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రారంభించారన్నారు. ఎగ్గె మల్లేశం ఇకనైనా రాష్ట్ర అధ్యక్షుడిగా తప్పుకొని ఇతరులకు అవకాశం ఇవ్వాలన్నారు. కురుమ సంఘంలో రాష్ట్ర కమిటీలు, జిల్లా కమిటీలు, మండల కమిటీలు వేసి ఎన్నికల ద్వారానే అధ్యక్షులను ఎన్నుకోవాలని డిమాండ్ చేశారు. ఊరెళ్ల రాజు, కృష్ణకాంత్, ఎల్లేశ్, అశోక్, నర్సింహ, ఆంజనేయులు, శ్రీకాంత్, శ్రీను ఉన్నారు.

పాస్టర్లకు నూతన వస్త్రాలు అందజేత

పటాన్‌చెరు, డిసెంబర్ 17: పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని 33 చర్చిల పాస్టర్లకు క్రిస్మస్ సందర్భంగా కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ నూతన వస్త్రాలు అందజేశారు. మంగళవారం పట్టణంలోని కార్పొరేటర్ నివాసంలో పాస్టర్ల కుటుంబాలకు విందు ఏర్పాటు చేశారు. క్రిస్మస్‌ను పురస్కరించుకొని కేక్ కట్‌చేసి సంబురాలు నిర్వహించారు. అనంతరం మెట్టు కుమార్‌యాదవ్ ఫాదర్లను సన్మానించి నూతన వస్త్రాలు బహూకరించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించడం బీఆర్ఎస్ సిద్ధాంతమన్నారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి కష్టం వచ్చినా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. వారితో కలసి కార్పొరేటర్ భోజనం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌చారీ, తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్లకు నూతన వస్త్రాలు బహూకరిస్తున్న కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్

వైభవంగా సీతారాముల కల్యాణం

స్వామివారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు

రామచంద్రాపురం, డిసెంబర్ 17: భారతీనగర్ డివిజన్‌లోని ఎంఐజీలోని రాములవారి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ పూజారులు సీతారామచంద్రస్వామిని పువ్వులతో అలంకరించి వేదమంత్రోచ్చరణల మధ్య కల్యాణం నిర్వహించారు. తిలకించేందుకు కాలనీవాసులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. స్వామివారి కల్యాణంలో కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి దంపతులు కూర్చొని కల్యాణం జరిపించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు భీమ్‌రెడ్డి, శ్రీనివాస్, సత్యనారాయణ, టీవీ రావు, సంపత్‌గౌడ్, రాకేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

మహిళలకు డ్రైవింగ్‌లో శిక్షణ

శిక్షణకు హాజరైన మహిళలతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 17: డ్రైవింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక బైపాస్ రోడ్డులోని ఎస్‌బీఐ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు మోటారు కార్ డ్రైవింగ్ శిక్షణను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు ఎంతో మంది ప్రభుత్వ, ఐటీ ఉద్యోగులు రోజూ రాకపోకలు సాగిస్తుంటారని, వీరిలో అధిక సంఖ్యలో మహిళలు ఉంటారన్నారు. మహిళా క్యాబ్ డ్రైవర్ ఉంటే భద్రత, భరోసాతో ప్రయాణం కొనసాగిస్తారని చెప్పారు. అందుకోసం మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించినట్లు తెలిపారు. ఎస్‌బీఐ శిక్షణ సంస్థ తొలిసారి మహిళలకు డ్రైవింగ్ శిక్షణ ప్రారంభించడం సంతోషంగా ఉన్నదన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో జ్యోతి, సంస్థ డైరెక్టర్ వంగా రాజేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో దివ్యాంగుల దినోత్సవం

సంగారెడ్డి కలెక్టరేట్, డిసెంబర్ 17: అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్నికలెక్టరేట్‌లో నిర్వహించారు. టీజీఐసీసీ చైర్ పర్సన్ నిర్మలాజెగ్గారెడ్డితో కలిసి కలెక్టర్ వల్లూరు క్రాంతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దివ్యాంగులు మానసిక స్థైర్యంతో ముందుకు పోవాలన్నారు.

వైభవంగా పల్లకీ సేవ

అందోల్, డిసెంబర్ 17: జోగిపేటలో మంగళవారం అయ్యప్పస్వామి పల్లకీ సేవ, ఆభరణాల ఊరేగింపు నిర్వహించారు. రాజరాజేశ్వర ఆలయం నుంచి క్లాక్‌టవర్, వీర హనుమాన్ మందిరం, పబ్బతి హనుమాన్ ఆలయం, పోచమ్మగుడి మీదుగా పల్లకీ సేవ, ఆభరణాల ఊరేగింపును కనులపండువగా నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. స్వాములకు కౌన్సిలర్ నాగరాజు అన్నదానం చేసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

జహీరాబాద్, డిసెంబర్ 17: పోలీసులు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని జహీరాబాద్ డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం న్యాల్‌కల్ మండలంలోని హద్నూర్ పోలీస్‌స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించి, క్రైంరేట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల రక్షణే ధ్యేయం కావాలన్నారు. మండలంలోని గ్రామాల్లో పేకాట, జూదం, మట్కా, గంజాయి తరలింపుపై నిఘా పెట్టాలన్నారు. దొంగతానాలు, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు, హద్నూర్ ఎస్ఐ చల్లరాజశేఖర్ పాల్గొన్నారు.

సందడిగా సెమీ క్రిస్మస్

కోహీర్, డిసెంబర్ 17: మండలంలోని కవేలిలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కవేలి గ్రామానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు ఏర్పాటు చేసిన కేక్‌ను సూపర్‌వైజర్ తులసి కట్ చేశారు. ఈ సందర్భంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. కార్యక్రమంలో సుజనమ్మ, శశికళ, అనంతలక్ష్మి, తదితరులున్నారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

జహీరాబాద్, డిసెంబర్ 17: జహీరాబాద్ మండలం పస్తాపూర్ డీడీఎస్ సంస్థ ఆధ్వర్యంలో న్యాల్‌కల్ మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో జీవ వైవిధ్యంపై విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. మంగళవారం మండలంలోని రేజింతల్, న్యాల్‌కల్, మామిడ్గి, మెటల్‌కుంట, మిర్జాపూర్(బి) పాఠశాల్లో విద్యార్థులకు పాత పంటలు, అంతరించిపోతున్న ప్రకృతి సంపద, వనరులు, పండుగల గురించి భవిష్యత్ తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో జీవ వైవిధ్యంపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని డీడీఎస్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆయా పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన క్విజ్ పోటీ విజేతలకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీడీఎస్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న డీడీఎస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

బొల్లారం డిసెంబర్ 17: ప్రణాళికాబద్ధంగా వార్డుల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు బొల్లారం మున్సిపల్ చైర్‌పర్సన్ రోజాబాల్ రెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలోని 11వ వార్డు బీరప్ప బస్తీలో మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రజల కనీస అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం 8వ వార్డులో పర్యటించి నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్డు పనుల పురోగతిపై ఆరా తీశారు. పనులను నాణ్యతగా చేపట్టి సకాలంలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఏఈ కిష్టయ్య, సిబ్బంది ప్రశాంత్, మాజీ వార్డు సభ్యురాలు శారద, స్థానికులు శ్రీనివాస్, రాజు, రమేశ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ రోజాబాల్ రెడ్డి

నక్క బాటను పరిశీలించిన అధికారి

బొల్లారం, డిసెంబర్ 17: జిన్నారం మండలంలోని ఊట్ల, మంగంపేట గ్రామాల మధ్య షెడ్డు పేరుతో అనుమతులు తీసుకొని అక్రమంగా నక్క బాటలో ఫంక్షన్ హాల్ నిర్మిస్తున్నారని గ్రామస్తులు హెచ్ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం హెచ్ఎండీఏ అధికారి స్వరూప నక్కబాటతోపాటు అక్రమంగా నిర్మించిన షెడ్డును గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. నాలాపై ప్రహరీ నిర్మిస్తున్నారని అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అక్రమాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. నక్క బాటను కాపాడి పనులు నిలిపివేస్తామన్నారు. నాలాపై నిర్మించిన ప్రహరీని తొలిగిస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఊట్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

'గీతం'లో సంస్కృతి క్లబ్ ప్రారంభం

పటాన్‌చెరు, డిసెంబర్ 17: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో సంస్కృతి క్లబ్ (స్పిక్ మెకే హెరిటేజ్ క్లబ్ ఆఫ్ గీతం)ను మంగళవారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమం భారతీయ వారసత్వం, సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని చాటుతూ వివిధ కళాత్మక ప్రదర్శనలు, సంప్రదాయాలు, ఆచారాలకు వేదికగా నిలిచింది. విద్యార్థులను సంఘటితపరిచి, వారిని సంప్రదాయ కళల వైపు ఆకర్షితులను చేయడం, సద్భావంతో మెలిగేలా చేసే లక్ష్యంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని డైరెక్టరేట్ ఆఫ్ స్టూడెంట్ లైఫ్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ సంయుక్తంగా నిర్వహించాయి. విద్యార్థిని యశస్వి చేసిన కూచిపూడి నృత్యం అందరిని ఆకట్టుకున్నది. గీతం స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని లలిత, ప్రదర్శన కళల విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు డ్యాన్స్ అండ్ మ్యూజిక్ ఫెస్టివల్‌ను నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మైథిలి సుశీల్ మరాట్, డాక్టర్ వై లలిత సింధూరితో సహా అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులు త్వరగా చేపట్టాలి

రామచంద్రాపురం, డిసెంబర్ 17: ఆర్సీపురం బస్ రూట్‌లో మిగిలి ఉన్న రోడ్డు విస్తరణ పనులను త్వరగా చేపట్టాలని కార్పొరేటర్ పుష్పానగేశ్ బల్దియా ఏఈ ప్రభుకి సూచించారు. మంగళవారం వార్డు కార్యాలయంలో ఏఈ ప్రభు, విద్యుత్ శాఖ ఏఈ తిరుపతమ్మతో కార్పొరేటర్ సమీక్ష నిర్వహించారు. రోడ్డు విస్తరణతోపాటు బాలవిహార్ పార్కులో పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని, శ్మశానవాటిక అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న పాత విద్యుత్ పోల్స్‌ని తొలిగించాలని ఏఈ తిరుపతమ్మకు సూచించారు. నాయకులు ఐలేశ్, మల్లేశ్, వినయ్‌కుమార్, హబీబ్, శ్రీరాములు, నవీన్‌యాదవ్ పాల్గొన్నారు.

ఘన వ్యర్థాల కాల్చివేతపై చర్యలేవి?

బొల్లారం, డిసెంబర్ 17: పారిశ్రామిక వాడలో తరచూ ఘన వ్యర్థాలను కాల్చివేయడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఇలాంటి ఘటనలు జరిగినా పీసీబీ అధికారులు తూతూ మంత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారని ఆరోపిస్తున్నారు. మంగళవారం మరోసారి పారిశ్రామిక ఘన వ్యర్థాలను కాల్చివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డు పక్కన, ఖాళీ ప్రదేశాల్లో డంప్ చేసి కాల్చి వేస్తున్నట్లు చెబుతున్నారు. కాల్చివేతలతో విడుదలవుతున్న ఘాటైన వాసనలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

జహీరాబాద్, డిసెంబర్ 17: జహీరాబాద్ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని పద్మశాలి భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రిటైర్డ్ ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎస్టీవో నర్సింహాచారి, రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం కౌన్సిలర్ బస్వరాజ్, జహీరాబాద్ ప్రభుత్వ విశ్రాంతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గడ్డం జనార్దన్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి రమేశ్‌బాబు పాల్గొన్నారు.

నారాయణఖేడ్‌లో..

నారాయణఖేడ్, డిసెంబర్ 17: అఖిల భారత విశ్రాంత ఉద్యోగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణఖేడ్‌లో సీనియర్ విశ్రాంత ఉద్యోగులను సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. 14 మందికి సభ్యత్వం అందజేశారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కిష్టయ్య మాస్టర్, బాధ్యులు నర్సింహులు, సయ్యద్ మొహియోద్దీన్, వీరయ్య, వెంకటేశం పాల్గొన్నారు.

కొనుగోళ్లు సాఫీగా చేపట్టాలి

మనూరు, డిసెంబర్ 17: రైతులకు ఇబ్బందులు లేకుండా సోయా కొనుగోళ్లు చేపట్టాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మనూరు మార్కెట్ గోదాంలో సోయా కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల కొనుగోలు విషయంలో రైతులకు ఇబ్బందులు తలపెడుతుందని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా రైతుబంధు ఇవ్వక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రంలో బీఆర్ఎస్ నాయకులు రవీందర్‌నాయక్, మండ ల అధ్యక్షుడు విఠల్‌రావు పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

పారిశుధ్య కార్మికుల ముందస్తు అరెస్ట్

సదాశివపేట: నిరసన తెలుపుతున్న పంచాయతీ కార్మికులు

పుల్కల్: నిరసన తెలుపుతున్న నాయకులు, కార్మికులు

సదాశివపేట, డిసెంబర్ 17: తమ సమస్యలు పరిష్కరించాలని చలో హైదరాబాద్ వెళ్తున్న పంచాయతీ కార్మికులను అరెస్టు చేయడం హేయమైన చర్య అని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం అరెస్టయిన పంచాయతీ కార్మికులను పోలీసుస్టేషన్‌లో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ పర్మనెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కార్యదర్శి దశరథ్, నాయకులు మాణ య్య, ముస్తాక్, మొగులయ్య, కుమార్, రవి, రాధాకృష్ణ, రవీందర్, నర్సింలు, సురేశ్, శివయ్య, రామగౌడ్, చంద్రయ్య, సంగయ్య, లక్ష్మి, మొగులయ్య పాల్గొన్నారు.

రాయికోడ్: పోలీస్‌స్టేషన్‌లో కార్మికులు

కల్హేర్: పోలీస్‌స్టేషన్‌లో జీపీ కార్మికులు

రాయికోడ్‌లో..

రాయికోడ్, డిసెంబర్ 17: అసెంబ్లీ ముట్టడికి హైదారాబాద్ తరలివెళ్తున్న గ్రామ పంచాయతీ కార్మికులను ముదస్తు అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. మంగళవారం రాయికోడ్ పోలీస్‌స్టేషన్‌లో మండల పరిధిలోని పంచాయతీ పారిశుధ్య కార్మికులను అరెస్ట్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు మంగాలి సత్యయ్య, పరిశుధ్య కార్మికులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన బొలెరో.. యువకుడి మృతి

మాణెయ్య (ఫైల్)

రాయికోడ్, డిసెంబర్ 17: బైక్‌ను బొలెరో ఢీకొట్టడంతో యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల పరిధిలోని నల్లంపల్లి గ్రామానికి చెందిన మాణెయ్య(29) కుటుంబ సభ్యులతో ఆదివారం న్యాల్‌కల్ వైపు వెళ్తుండగా, వట్‌పల్లి నుంచి వస్తున్న బొలెరో వాహనం రాయికోడ్ గ్రామ శివారులో ఢీకొట్టింది. ఈ ఘటనలో మాణెయ్య తీవ్ర గాయాలు కావడంతో చిక్సిత నిమిత్తం జహీరాబాద్ దవాఖానకు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చిక్సిత నిమిత్తం హైదరాబాద్‌లోని ఉస్మానియా దవాఖానకు తీసుకెళ్లారు. అక్కడి చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి తండ్రి శామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భెల్ క్వార్టర్స్‌లో షార్ట్ సర్క్యూట్

రామచంద్రాపురం, డిసెంబర్ 17: బీహెచ్ఈఎల్‌లోని ఎంహెచ్ క్వార్టర్స్‌లో సోమవారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఒడిశాకు చెందిన బీరేంద్రకుమార్ భెల్ పరిశ్రమలోని జీరో 6 బ్లాక్‌లో క్వాలిటీ కంట్రోల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. భెల్‌లోని ఎంహెచ్ 5కి సంబంధించిన 2071 క్వార్టర్స్‌లోని ఏ బ్లాక్‌లో కుటుంబంతో కలిసి నివాసం ఉంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం అతడు బెడ్‌రూంలో నిద్రిస్తున్న క్రమంలో అతడి భార్య పిల్లలను తీసుకురావడానికి స్